శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!

సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!!

# గురుకృప

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!

కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!



## జన్మదిన సంచిక

ఓ సద్గురూ! నా హృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి!

ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

గురుకృప జనవరి - 2004

## సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!



ప్రజలందరి నోట సాయి నామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
– అదే నాఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.


--- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో


1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!! — శ్రీ బాబూజీ
2. ఉన్నమాట - అనుకున్నమాట — గురుబంధువులు
3. గురు సాన్నిధ్యం - ఆస్వాదనకు నిలయం — సంధ్య
4. తెలుసు నా మనసు - సాయి నాథునికి — పి. హరిమాధవ్
5. అడిగిందే ఇచ్చారు — గురుబంధువు
6. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గురూజీ — ప్రవీణ్
7. తోడు నీడా గురువే — కె. అనిల్ కుమార్
8. న.. భయం అనుకుంటే అభయమే వుందంతే — గాయత్రి
9. సత్సంగ సుమహారం — గురుకృప
10. స్వర్ణోత్సవ సుమంగా మనం ఏం సమర్పిద్దాం? — గురుబంధువులు

## ఉన్నమాట - అనుకున్నమాట

బయలుదేరిన చోటు నుండి గమ్యం చేరే వరకు రైలు బండి పట్టాలపైననే పయనం సాగిస్తుంది. ప్రయాణకాలంలో ఒడిదుడుకులుంటాయి. అందువలన చేరదల్చిన నిర్ణీత సమయంలో కొద్దిపాటి ఆలస్యం జరగవచ్చు. అయినా మొత్తం మీద రైలుబండి తనలో ప్రయాణించేవారిని గమ్యస్థానానికి తప్పకుండా చేర్చి తీరుతుంది. అలాంటప్పుడు మన ఇష్టదైవాన్నిగాని, మహాత్ములనుగాని, మనకి ప్రియాతి ప్రియమైన బాబానుగాని, సద్గురు స్వరూపులను రైలుబండివంటి వారనుకుందాం. రైలులో ఎందరెందరో ప్రయాణం సాగిస్తారు వారి వారి అవసరాలకనుగుణంగా. ఈ రైలుబండి సుదీర్ఘమైన గమ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. అది కొన్ని జన్మలదాకా ప్రయాణం సాగించవచ్చు. కొన్ని సంవత్సరాలు, నెలలు, వారాలు, రోజులు, గంటలు, నిమిషాలు కావచ్చు. ఈ ప్రయాణ కాలంలో ఎంతెంతో దూరం వెళ్ళినాక విచిత్రమైన స్టేషన్లు ఉన్నాయి. ఆగిన ప్రతి స్టేషనులోను వింత వింతైన వ్యక్తులెక్కుతుంటారు, దిగిపోతుంటారు, ప్రయాణీకుడంటే ఇక్కడ సాధకుడని అనుకుందాం. ఎక్కేముందే తామేస్టేషనులో దిగాలో తెలుసుకొని టిక్కెట్లు కొంటారు. వారి స్టేషను రాగానే దిగిపోతారు. ప్రయాణం సాగించే వారిలో బయలుదేరిన తావు నుంచి చివరి స్టేషను వరకు కొందరు టిక్కెట్టును కొనుగోలుచేస్తారు. కొందరు రైలు యొక్క విశిష్టత తెలిసి మార్గమధ్యంలోని స్టేషనులో ఎక్కినను చివరి దాకా ప్రయాణం సాగిస్తారు.



రైలు ఇంజనుకు ఇంధనమనేది 'గురుకృపే' అదే అన్నింటికి మూలము. రైలు సక్రమంగా నడిచేందుకు ఆధార ఆధేయముల వంటివి రైలుపట్టాలు. పట్టాలెప్పుడు సమాంతర రేఖలే. అవి రెండుగా కన్పించినను స్టేషన్లు వచ్చేసరికి వాటిని కలిపే పాయింట్స్ ఉంటాయి. ఈ పట్టాలు మాత్రం చాలా గట్టిగా ఉండాలి. 'మొదటి పట్టా నైతిక విలువ, రెండవ పట్టా ఆధ్యాత్మిక చైతన్య' మనుకుందాం. ప్రయాణం చేసేసాధకుని చేతుల్లో నీతి, నిజాయితీ, త్యాగం, ఆదర్శం, దానం, ధర్మం, దయ, కరుణ, పోషణ, సుబుద్ధి, సత్యశీలత, ధైర్యం, ప్రేమ, సహనం, ఓర్పు, సౌశీల్యం, భక్తి, సేవాతత్పరత, శ్రవణకీర్తన, ఆత్మాశ్రయత్వాలనే అనేకానేక స్టేషనులకు సంబంధించిన టిక్కెట్లుంటాయి. మంచినోటుకు మారుగా దొంగనోటు, మంచి వస్తువుకు మారుగా నకిలీ వస్తువులెలా ఉంటాయో, ఈ రైల్లో కూడా నకిలీవి, దొంగటిక్కెట్లు, టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేసేవారు ఉండేందుకు అవకాశముంటుందేమో! అవినీతి, అక్రమార్జన, లాభాపేక్ష, స్వలాభాపేక్ష, స్వోత్కర్ష, ఎగవేత, లంచగొండితనం, మాయ, కపటం వంటి టిక్కెట్లుకొని కొందరు ఈ రైలులోనే ప్రయాణం చేస్తుంటారు. వీరు చివరి వరకు రావాలనుకుంటారు కాని.. కాని.... కాని

రైలు కొన్ని స్టేషనులందాగుతుంది. సాధకుడనే ప్రయాణీకుడు అంతరంగంలో గురువనేరైలు ఆగినచోటల్లా గమనించుతాడు, అన్వేషిస్తాడు. మజిలీకి, మజిలీకి ఉన్న ఆనందానుభూతిని అనుభవిస్తాడు. గుర్వనుగ్రహమనే చలివేంద్రంలోని రసాస్వాదనను తృప్తి తీరా జుఱ్ఱుకుంటాడు. అందుకొర్కై వేచి వేచి ఎదురు చూస్తాడు. వీని రసానుభూతి, అతిశయమైన ఆనందం మాత్రం, నకిలీ టిక్కెట్టు దారులకు, కప్పదాటువంటి వారికి, గోడ మీద పిల్లిలాంటి వారికి, ఏ ఎండకాగొడుగు పట్టేవారికి, ఏదైనా మనకొకటేనని తలంపుల వారికి, అవసరాలకు, స్వార్ధ ప్రయోజనాలకు బాకాలూదువారికి, కొమ్ము కాచేటి వారికి, బూరలూదు వారికి, డూడూ బసవన్నలకు, గుంపులోని గోవిందయ్యలకు, తగరువంటి తలల వారికి లభించదు. పైగా ఎప్పుడెప్పుడుదిగిపోదామా! మరో బండినెక్కుదామా

అని అర్రులుగొని వుంటాడు. తన స్థాయి స్టేషను వస్తే బాగుండునని ఆరాటపడుతుంటాడు. ఇంతలోనే పరీక్షకుడనే టి.సి. ఎక్కగానే రసానుభూతి పొందినవాడు తన టిక్కెట్టు చూపించి దర్జాగా సీటులో కూర్చొంటాడు. ఇదిలేని, ఇదే వారి గమ్యం కాని వారంతా టి.సి.ని చూచి దాక్కుంటారు. తమసీట్లలోంచి వేరే దారుల వైపుకు వెళ్ళేందుకు ప్రయత్నాలు చేస్తారు. రైలు ఆగిన వెంటనే టి.సి. కి దొరక్కుండా గుంపులు గుంపులుగా తోసుకుంటూ, త్రొటుబాటు చెందుతూ దిగిపోతారు. తాము దిగవలసిన స్టేషను అదికాక పోయినప్పటికీ. దీని కంటె ముందే మరో విచిత్రం జరుగుతుంతుంది. రద్దీగా ఉన్న ప్రతి బోగీల్లోకి ప్రయాణీకులకు తినుబండారాలు అందించేందుకు సేవాభావన, భక్తితత్పరతలు అనే ఆకర్షణీయమైన దుస్తులు, వేషము వేసి వ్యాపారస్తులొస్తారు, పెద్ద పెద్ద సంపాదనలనే తమ జేబులు నింపుకొనేందుకు ప్రతి పెట్టెచుట్టూ పాటికి పదిసార్లు తిరుగుతూనే ఉంటారు. కొదరికి కొసర్లు విసురుతారు. కొందరికి ఎరలేస్తారు. కొందర్ని మాటలతో రాబట్టుతారు, ఉచితంగా మిఠాయిలు పంచుతారు, తాయిలాలు ఇస్తారు. కొందర్ని లోభపర్చుకుంటారు వారికి కావాల్సింది తమగంపలోని సరుకు అయిపోయి వారాపేక్షించిన లాభం రావటమే వారికి ముఖ్యం. పెట్టె పెట్టెకు తిరిగి తన సరుకును ఎన్ని అగచాట్లు పడ్డా చాకచక్యంగా అమ్మేస్తాడు. నాలుగు ధనరాశులను పెంచుకుంటాడు. రైలు ప్రయాణిస్తూనేవుంది... రైలు పయనమైపోతూ వుంది. ఇంతలో... ఎక్కడొ నవ్వువినిపిస్తుంది. ఆ నవ్వు శబ్దాలను చేధిస్తున్నది. వాస్తవాలను చూడమంటుంది. ఎవరెవరెలాంటి వారో చూడు అంటుంది. ఆకర్షణకు లోనై మధ్యలో ఎలాంటి వారు దిగారో గమనించమంది. ప్రలోభాలకు లోనుగాక, మధ్యలోనే దిగిపోకుండా చివరిదాకా ఎవరుంటారో చూడాలని నా సంకల్పం. పరీక్షకుని చూచి భయపడకుండా కూర్చున్న వారెందరో చూడాలని నా తపన. స్థిత ప్రజ్ఞులకై అన్వేషణ. మళ్ళీ నవ్వు. ఆ నవ్వుకు ఒక్కొక్కసారి ఒక్కొక్క అర్థం. నవ్వు పెద్దదైంది. నేస్తులారా భయపడకండి. నవ్వింది ఎవరోకాదు. రైలే అని నేననుకుంటున్నా....

*తమకేది మంచిదో అది బాబా తప్పక చేస్తారనే విశ్వాసం సాధనాపథంలో ప్రథమ సోపానం*

*సాయిభక్తి సాధన రహస్యం*

గురుక్రుప పత్రిక అంకురారోపన జరిగి నేటికి ఆరు వసంతాలు నిండింది. ఈ గడిచిన వసంతాల సింహావలోకనంలో గురుబంధువుల సహకారం గురు అనుగ్రహంతో నిండుగా, మెండుగా అందింది. 'గురుకృప' పత్రిక స్థాపనాలక్ష్యాన్ని మరొక్కసారి ఎఱుకలోకి తెచ్చుకునే ప్రయత్నం... **గురులీలలనే అనుగ్రహంతో లభించిన అనుభవసారాన్ని మనమందరం పంచుకొని యోచనతో ఆచరిస్తే గురువుని అన్ని విషయాలకు, ఎల్లప్పుడూ అంటిపెట్టుకొనే విశ్వాససాఫల్యత మనకు కలుగుతుంది. అలా గురువుకు శరణాగతి చెందడమే మనకు గమ్యం.. అదే 'గురుకృప' లక్ష్యం.**

ఒక్కడుగు తనవైపుకేస్తే పది అడుగులు తాను వేస్తానని బాబా ఇచ్చిన అభయమనే బాటను మనకు రాచబాటగా అందించిన గురుపథంలో మనం ఎన్ని అడుగులు వేయగలిగామన్న అవలోకనే ఈ నూతన వత్సర ఆరంభం కావాలని 'గురుకృప' ఆకాంక్ష. గురువుయొక్క విశిష్టత, గురువుయొక్క ఆవశ్యకత, గురుసాన్నిధ్యం, గుర్వనుగ్రహం.. ఇత్యాది విషయాల పట్ల అవతారపురుషుల, భాగవతుల, సాధకుల భావాలను మనముందుంచు కొనే ప్రయత్నం 'రసస్పందన' అనే శీర్షిక ద్వారా వచ్చేసంచిక నుండి అవధరించగలరు. ఆ చేయి ఎంతహాయి - అన్న శీర్షికను కొన్ని కారణాల వలన నిలిపి వేయడమయినది. దాని స్థానే 'సదా రక్షమాం సద్గురు రాయ' అనే నూతన శీర్షికను వచ్చే సంచిక నుండి 'సద్గురు ప్రియ' సమర్పణలో గురుకృప సమర్పించబోతున్నది.


# గురు సాన్నిధ్యం - ఆస్వాదనకు నిలయం

ఈ బంధాలు, అనుబంధాలు ఎక్కడివి? ఆనందమా, అభిమానమా, ఏదో ఒక తెలియని ఆవేశమా, ఏమందాం దీన్ని, కేవలం గురుదేవులతో ఉన్న ఋణానుబంధం ఈ గురుబంధువుల్లో ఎంత మార్పు తీసుకొస్తోంది. వారి అనుగ్రహానికి అర్హతలను పెట్టక ఆస్వాదించడమే జీవిత పరమావధి అన్న సద్గురు వాక్యాన్ని ఒక గురుబంధువు వ్యక్తీకరించిన తీరును గమనిద్దాం... (సాయి కుటుంబీకులమైన మనలో ఇంకా అడ్డుగోడలుగా నిలుస్తున్న అంశాలను వర్జించడం ప్రారంభిద్దాం. ఇది సాయిసమైక్య కుటుంబం) నిత్య జీవితంలో ఆనందాన్ని, బాబా మనలను తీర్చిదిద్దే క్రమంలో మనం భావిస్తున్న బాధల్ని పంచుకోవడం ఈ గురుబంధువుల నిత్యకృత్యం. ఈ పంచుకోవడమే 'సద్గురువు' పై ప్రేమను పెంచుకోవడానికి నాంది.

**గురుకృప**

గురువుగారి పాదములకు నా నమస్కారములు తెలియజేసుకుంటూ...


నేను సాయిపథం ఆశ్రమం చూడటం ఇదే ప్రథమం (జూలై 12, 2003). నేను ఇంటి నుండి శిరిడీకి బయలుదేరే ముందు, నాకు శిరిడిలో క్రొత్త వ్యక్తులు పరిచయం అవుతారు, వారితో ఎలా Mingle అవ్వాలో అనే ఫీలింగ్‌తో బయలుదేరాను. కాని, అక్కడకు వెళ్ళిన తరువాత నేను నా కుటుంబ సభ్యులనే కలిసినట్లు అనిపించింది. అక్కడ అందరూ అన్నలు, అక్కలూ, చెల్లెల్లు, తమ్ముళ్ళు - అందరూ మన వాళ్ళే అక్కడ ఉన్నదంతా ఒక్కటే కుటుంబం. ఈ కుటుంబ పెద్దలు - బాబా, గురువుగార్లు. ఈ కుటుంబంలో వేరు వేరు భాషల వారు, వేరు వేరు ప్రాంతాల వారు ఉన్నారు. కాని, మా అందరిది ఒక్కటే మతం, ఒక్కటే కులం - సాయి మతం, సాయి కులం. అనుక్షణం సాయి ఊసులో, సాయి ధ్యాసలో గడపటానికి ఈ కుటుంబ సభ్యులెంతో దోహదపడ్డారు. వీరంతా గురువుగారిచ్చిన బంధువులు - అందుకే గురు బంధువులు.



గురుపూర్ణిమనాడు (జూలై 13) ఉదయం 10.30-11.00 గంటల మధ్య గురుబంధువులు కొందరు (నలుగురు జంటలు) గురువుగారి చేతుల మీదుగా పెళ్ళిళ్ళు చేసుకోవడానికి, మరికొంతమంది చిట్టి చెల్లెళ్ళు, తమ్ముళ్ళు గురువుగారిచే అక్షరాభ్యాసము చేయించుకొనుటకు సిద్ధముగా వుండి, వారి రాకకై ఎదురుచూడసాగారు. అలానే తక్కిన గురుబంధువులంతా ఆ దివ్యమంగళ రూపాన్ని చూడటానికి వెయ్యి కళ్ళతో ఎదురుచూడసాగారు. ఆ నిరీక్షణలో ఓ మనోహర రూపం (గురువుగారు) నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ స్టేజి పైకి వచ్చారు. ఆ మనోహర రూపాన్ని ఎంతో కాలం నుండి చూడాలని (2000 లో మొదటిసారి గురువుగారిని వైజాగ్ లో చూసాను. తరువాత ఇదే చూడటం) వేచి వున్న నా కళ్ళకు, మనస్సుకు ఒక్కసారిగా దాహం తీరింది. ఆ రూపాన్ని చూసిన నా కళ్ళు కన్నీటితో నిండి పోయాయి, ఎందుకో తెలియదు. ఆ నీటి ధారలను తుడుచుకుంటూ, గురువుగారిని కనురెప్ప వేస్తే ఆయన్ని చూడటం ఎక్కడ మిస్ అవుతానో అని ఆసాంతం కనురెప్ప కూడా వేయకుండా సుమారు గంటన్నర సేపు గురువుగారిని చూసుకొన్నాను. చాలా కాలం తరువాత గురువుగారిని చూసినా అంత ఎక్కువ టైమ్ చూడటం వలన మనస్సు ఎంతో తృప్తి పడింది.

గురుచరణ్ నుండి స్టేజి వరకు వచ్చే దారిలో ఒక రెడ్‌కార్పెట్‌ను పరిచారు దాని పైనే గురువుగారు నడిచారు. అది చూసిన నేను ఆ కార్పెట్‌ను ఒక్కసారి తాకి నమస్కరించుకోవాలనుకున్నాను. కాని అందరి ముందూ ఆ కార్పెట్‌కి నమస్కరించటానికి అహం అడ్డు వచ్చింది. తరువాత ఆ కోరికను నేను మరచిపోయాను.

ఆ రోజు మధ్యాహ్నం గురువుగారు పూజించుకునే బాబా ఫోటోను పల్లకిలో రేగించారు. గురుబంధువులంతా ఇందులో పాల్గొన్నారు. ఆశ్రమం నుండి మందిరం వరకూ వెళ్ళి తిరిగి ఆశ్రమానికి వచ్చారు. తిరిగి వచ్చేటప్పుడు నాకు, అమ్మకు పల్లకీ మోసే అవకాశం కలిగింది. తిరిగి వచ్చిన తరువాత పల్లకీని గురుచరణ్ ముంగిట ఉంచారు. అమ్మగారు బాబాకు ఆరతి ఇస్తూ ఉండగా గురుబంధువుల తోపులాటవలన నేను కొంచెం లెఫ్ట్‌కి జరిగాను, కాదు త్రోయబడ్డాను. అప్పుడు నా కాలి క్రింద ఏదో తగిలింది. అది గురువుగారు నడిచి వెళ్ళిన రెడ్‌కార్పెట్. నేను మరిచిపోయిన, అహంకారంలో విడిచి పెట్టిన ఆ కోరికను గురువుగారు ఈ సందడిలో అయితే నిన్ను ఎవ్వరూ పట్టించుకోరులే అన్నట్లు ఆ కార్పెట్‌ను చూపించారు. నేను దానికి నమస్కరించుకొని గురువుగారికి కృతజ్ఞతలు చెప్పుకొని బాబా నామస్మరణ చేస్తూ లెఫ్ట్‌కి చూసాను. పక్కనే ఉన్న కిటికీలో నుండి ఇంటి లోపల ఉన్న స్టెప్స్, పై పోర్షన్‌కు వెళ్ళే ఎంట్రన్స్ కొంచెం కనపడినవి. గురువుగారి ఇల్లు చూడాలనే నా కోరికను కూడా ఆయన (పార్ట్‌లీ) తీర్చారు అని అనుకుంటూ ఇంకొంచెం ఇంట్లోకి వంగి చూడగా మెట్ల మధ్యన ఉన్న బాబా ఫోటో కాదు దానిపై ఉన్న కొటేషన్ని 'Why fear ? I am hear' చూసాను (ఆ ఫోటోలో ఉన్న బాబాను మరుసటి రోజున చూసాను). మా ఇంట్లో బాబా ఫోటో ఒకదానిపై నేను అదే కొటేషన్ని అంటిస్తూ, ఈ కొటేషన్ చాలా చిన్నదిగా ఉందే, బావుంటుందో లేదోనని ఫీలింగ్‌తో అంటించాను. కాని ఇప్పుడూ అదే కొటేషన్ గురుచరణ్‌లో కనిపించింది. ఈ కోఇన్సిడెన్స్ నా మనస్సుకి ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.



ఇలా అక్కడ ఉన్నన్ని రోజులూ మనస్సు ఎంతో ఆనందంగా ఉంది, రెండో ఆలోచన లేదు, ఏ చింతా లేదు. ఇప్పుడు ఇంటికి వచ్చిన తరువాత రొటీన్‌లైఫ్, అందుకే ఈ లెటర్ వ్రాయటానికి ఇంత ఆలస్యం.

సంధ్య, విశాఖపట్టణం

*సద్గురుదేవ పద రాజీవముల దలంచు క్షణముననే మన జీవితమున మేలు చేకూరును*

*శ్రీ సాయి అనుసరణము*

## తెలుసు నా మనసు - సాయి నాథునికి

*'తృప్తిని, శాంతిని, సంతోషాన్ని, నమ్మకాన్ని, నిశ్చింతను మాటలతో వివరించలేని విధంగా మనకు అనుభవమయ్యేలా చేసేవారే సద్గురువు.... ఆ సద్గురువు పట్ల మనకున్న ప్రేమను వ్యక్తం చేయడానికి చేసే ప్రతి పని పూజే... బాబూజీ'.* సద్గురు సన్నిధానంలో వర్షించిన అపారకృపారసంలో ఓలలాడిన వ్యక్తి తన ఆస్వాదనను వ్యక్తీకరించుకుంటాడు. దానికి 'కొలబద్ద' ఏమైనా ఉందా! అంటే, చోల్కర్ సాయి సన్నిధానాన్ని చేరటానికి 'చక్కెర'ను వదిలివేశాడు. భీష్మ తన గేయాలతో సాయినాథునికి పదార్చన చేసాడు. ఆయీ మసీదును, బాబా నడిచే మార్గాలను శుభ్రపరుస్తూ 'సేవను' పరమావధిగా స్వీకరించింది. ఇలా ఎందరో, ఇది ఒక అనుగ్రహసాగరం, ప్రేమ సముద్రం.

అసలు విషయం ఈ అన్నిటివెనుక మనలో ప్రేరణకు, తద్వారా వచ్చిన ప్రతిభకు కర్త సద్గురువు, ఇవి జరగడానికి క్రియారూపం సద్గురు అనుగ్రహమే! ఇక ఈ అనుభవంలోని రెండవ అంశాన్ని గమనిస్తే, సూఫీ తత్త్వం వ్యక్తపరచినట్లు 'సప్తమ స్వర్గంలో భగవంతుని సింహాసనముంటుంది: ఆ సప్తమ స్వర్గం మానవ హృదయంలో ఉంటుంది', అలా మన హృదయ సింహాసనంలో సదా నివసించే సద్గురువు, మన భావాలను గమనించి అవసరమైన సమయంలో ఆనందాన్ని అందించిన తీరు గురుబంధువు మాటల్లో.

### గురుకృప

బాబాగారి, గురువుగారి ఆశీస్సులతో రెండవసారి విజయదశమికి శిరిడీకి వెళ్ళి బాబాగారిని, గురువుగారిని దర్శించుకున్నాను, బాబా, గురువుగార్ల ఆశీస్సులతో అక్కడ జరుగు అన్నదాన కార్యక్రమములో సేవచేసుకొను భాగ్యము లభించింది. మొదటిసారిగా సాయియానలో, మసీదులో సేవ చేసుకొను భాగ్యము 2000 సంవత్సరము విజయదశమికి శిరిడీకి వెళ్ళినపుడు కలిగినది, సేవా కార్యక్రమములో పాల్గొనేవాడిని, మొదటి సారి శిరిడీకి వెళ్ళినపుడు అక్కడ వున్న గురుబంధువుని నాకు అన్నదాన కార్యక్రమములో సేవ చేయాలని వున్నది అని అడిగాను. నాకు పని చెప్పండి చేస్తాను అన్నాను. వారు **'నాకు ఎవరు చెప్పారు'** అని అడిగారు, నాకు కూడ సేవ చేయాలని వున్నది అని చెప్పాను. అక్కడ వున్న గురుబంధువు ఒకరు నైవేద్యము పెట్టాలా అని అడిగారు. నైవేద్యము తీసుకురావాలి అని చెప్పారు. కొద్దిసేపటికే గురుబంధువు ఒకరు నైవేద్యము తీసుకొని వచ్చారు. బాబాగారికి, గురువుగారికి నైవేద్యము పెట్టి మా అందరికి కూడా ప్రసాదము పెట్టినారు. నాకు అప్పుడు అనిపించింది. ఆ గురుబంధువు నాకు ఎవరు చెప్పారు అని అడిగినదానికి నాకు జవాబు ఈ విధముగా బాబాగారి, గురువుగారి ఆశీస్సులతో లభించినది (1). మొదటిసారిగా సాయియానలో గురుబంధువులు కూర్చొను ప్రదేశములో నీళ్ళు చల్లి ఆ ప్రదేశము శుభ్రముచేయు సేవ లభించినది. ఒకరోజు ద్వారకామాయికి వెళ్ళి అక్కడ బాబా గారికి నమస్కారము చేసుకొని వస్తుండగా అక్కడ గురుబంధువు పిలిచి ఇక్కడ వున్న 'ఊదిని' తీసుకువెళ్ళి చావడి వెనకాలవున్న ఊది గదిలో పెట్టి రావాలి అని అడిగారు. వారితో అలాగే అని చెప్పి ఆ ఊదిని తీసుకొని వెళ్ళి ఊది గదిలో పెట్టాను. అలా అక్కడ మొదటిసారిగా సేవ చేసే భాగ్యము కలిగినది. (2). నాకు గురువుగారి ఆశీస్సులతో, గురువుగారి చేతుల మీదుగా ఊదిని తీసుకోవాలని వుండేది. శిరిడీకి టిక్కెట్టు రిజర్వేషన్ చేయించుకొన్న రోజు నుంచి బాబాతో, గురువుగారితో చెప్పుకొనేవాడిని. మొదటి సంవత్సరము వెళ్ళినపుడు ఈ అదృష్టము లభించలేదు. రెండవసారి వెళ్ళినప్పుడు ఇలాగే చెప్పుకొనేవాడిని. చావడిలో, ద్వారకామాయిలో, గురుస్థానంలో, బాబా సమాధి మందిరము వద్ద ఇలాగే చెప్పుకొంటున్నాను. విజయదశమి మరుసటిరోజు నుంచి గురువుగారు డయాస్ మీద దర్శనమిచ్చి అందరికి ఊది ఇచ్చి ఆశీర్వదిస్తున్నారు. అలా నాకు మొదటి సారి గురువుగారి పాదములకు నమస్కారము చేసుకొని వారి చేతులమీదగా ఊది తీసుకొనే భాగ్యము బాబాగారి, గురువుగారి ఆశీస్సులతో లభించింది. (3). మొదటిసారి శిరిడీ వెళ్ళినప్పుడు సాయియాన బస్సులను చూచాను, బస్సులు చాలా బాగున్నవి. ఈ బస్సుల్లో ప్రయాణం చేస్తే చాలా బాగుంటుంది అని అనుకొంటూ సాయియానకు వచ్చేవాడిని. రెండవసారి శిరిడీ వెళ్ళి వచ్చేటప్పుడు నాతో పాటు ఇద్దరు గురుబంధువులు వచ్చారు. అందరం కలిసి వెళదామన్నారు. సరేనని చెప్పాను. వారు ద్వారకామాయికి వెళ్ళి నమస్కారము చేసుకొని వస్తామన్నారు. సరేనని చెప్పాను. వాళ్ళు వెళ్ళి చాలాసేపు అవుతూవున్నది. ఈలోగా సాయియానా దగ్గర వున్న కారులన్నీ వెళ్ళిపోయిన కొద్దిసేపటికి ఆ ఇద్దరు వచ్చారు. ఇక్కడ కారులు, జీపులు లేవు. కొద్ది దూరము వెళ్ళిన తరువాత జీపు కనబడింది. ఆ జీపు డ్రైవరు ఇంకా నలుగురు వస్తే వెళ్తానన్నాడు, ఎవరు రాలేదు. అక్కడవున్న కారు డ్రైవరు మమ్మల్ని నాగర్‌సోల్ వెళ్ళడానికి 200 రూ॥ అడిగినాడు. మేము 150 రూ॥

మాత్రమైతే యిస్తామన్నాము. ఆ డ్రైవరు ఒప్పుకోలేదు. బాబాగారిని, గురువుగారిని తలచుకొంటూ వెనుకకు తిరిగి చూడగా అక్కడ మాకు సాయియాన బస్సు కనపడింది. ఆ బస్సులో ఖాళీవున్నది అని చెప్పారు. అలా మేము సాయియాన బస్సులో సికింద్రాబాద్ వచ్చినాము. అలా ఆ బస్సులో ప్రయాణము చేయాలి అనే కోరికను బాబా, గురువుగార్లకు చెప్పుకోలేదు. అయినా వారు నా కోరికను గ్రహించి అలా సాయియాన బస్సులో ప్రయాణం చేసే అదృష్టాన్ని కలిగించారు. బాబా, గురువుగార్ల అనుగ్రహంతో నాకు కలిగిన అనుభవాన్ని 'గురుకృప' పత్రిక ద్వారా గురుబంధువులతో పంచుకొనే భాగ్యానికి ఆనందపడుతున్నాను.

పి. హరి మాధవ్, తెనాలి.

## ఆడిగిందే ఇచ్చారు

సద్గురు పాదములకు నమస్కారములర్పించుకుంటూ... 1997 డిసెంబరులో మేము షిర్డీ వచ్చాము. షిర్డీ వచ్చినాక గురువుగారి దర్శనము చేసుకొని బాబు కావాలని కోరుకున్నాము. గురువుగారు మౌనముగా ఉన్నారు. తరువాత 1998 గురుపౌర్ణమికి వచ్చాము. 1999 గురు పౌర్ణమికి వచ్చాము. 1999 వచ్చినప్పుడు బాబు కావాలని మళ్ళీ అడిగాము. తరువాత 2000 లో వచ్చినప్పుడు ఆపరేషన్ చేయించమంటారా ఉంచమంటారా అని అడిగితే గురువుగారు అలా ఉండనీ అని అన్నారు. 2001 సెప్టెంబరు 19వ తారీఖున బాబు పుట్టాడు. బాబు పుట్టిన దగ్గరనుండి గురువుగారి చేత నామకరణము, అన్నప్రాసన చేయించుకోవాలని అనుకున్నాము. గురువుగారు పేరు పెట్టరు. మీరే పెట్టుకోండి, అన్నప్రాసన ఒక్కటే గురువుగారు చేస్తారు అని అందరూ అన్నారు. మేము మాత్రం, గురువుగారు మీరే మా బాబుకి పేరు పెట్టి, అన్నప్రాసన చేయాలని రోజు ప్రార్థిస్తున్నాము. 1వ తారీఖున గురువుగారు షిర్డీ వచ్చారని తెలిసి షిర్డీ వచ్చాము. గురువుగారికి, బాబాకి నమస్కరించుకొని బాబుకి పేరు, అన్నప్రాసన గురువుగారితో చేయించుకోవాలనుకుంటున్నాము అని నారాయణరావుగారికి చెప్పాము. నారాయణరావుగారేమో నరేంద్రగారికి చెప్పమని అన్నారు. నరేంద్ర గారికి చెపితే గురువుగారు అన్నప్రాసన చేస్తారుగాని, పేరేమో చెప్పలేము, ఎప్పుడోగాని పెడతారు పేరు అని అన్నారు. గురువుగారి చేత పేరు, అన్నప్రాసన చేయించమని గురుస్థానములో, ద్వారకామాయిలో, చావడిలో బాబాని వేడుకున్నాము. 9 వ తారీఖు షిర్డీ వచ్చాము. 10వ తారీఖు రాత్రి అన్నప్రాసన చేశారు. బయలుదేరండి అని తల పారు. పేరు పెట్టండి గురువుగారు అని అడిగితే 2 నిమిషాలు ఆగి 'సాయి శరణ్' అని పేరు పెట్టారు. పేరు పెట్టాక మాకు చాలా ఆనందం కలిగింది

గురుబంధువు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గురూజీ

పూజనీయులగు మా గురువుగారికి నమస్కారాలు తెలుపుకుంటూ నాకు జరిగిన ఓ అనుభవాన్ని మీకు తెలుపుకుంటున్నాను. గురుబంధువులకు నా నమస్కారం. 'గురుపౌర్ణమి' సంచిక చాలా బాగుంది, అందులోని లీలలను, అనుభవాలను చదువుతుంటే నాకు గురువుగారిపైన మరియూ సద్గురువు బాబాపైన చాలా విశ్వాసం పెరిగింది.

నా పేరు డి. ప్రవీణ్ కుమార్. మాది తిరుపతి. నేను 1997 నుండి గురుబంధువును అయినాను. మొదట నాకు గురువుగారి దర్శనం గురుపూర్ణిమ (1999) నాడే జరిగింది. అప్పటి నుండి గురుపౌర్ణిమ ఉత్సవాలంటే నాకు

ఎంతో ప్రీతి. అప్పటి నుండి ఇప్పటివరకు నేను ప్రతి గురుపౌర్ణిమ ఉత్సవాలలో తప్పకుండా పాల్గొంటున్నాను. ఇంటర్మీడియట్ కంప్లీట్ అయింది. ఇక ఇంజినీరింగ్లో చేరాల్సి ఉంది. ఎప్పటిలాగే ఈసారి కూడా 2003 గురుపౌర్ణమికి వెళ్ళాలని, నేను, నా స్నేహితుడు మురళీ కలసి బాబా నామం చెప్పుకుటూ గురుస్థానంలో ప్రదక్షిణ చేస్తూ గడపాలని అనుకున్నాము. మే (2003) లో గురువుగారు తిరుమలకు విచ్చేసినప్పుడు వారి దర్శనం చేసుకుని, వారి పవిత్ర ముఖసౌందర్యాన్ని చూచి అనుభవించి నా మనస్సులోని కోరికను (శిరిడి వెళ్ళటం) గూర్చి చెప్పుకున్నాను. గురువుగారు 'సరే' అని ఊది ఇచ్చారు. ఇలా జరిగిన కొద్ది రోజులకే EAMCET Results వచ్చాయి నాకు వచ్చిన Rank కినాకు ఇష్టమున్న seat (ECE , Electronics and Communication Engg.) రాదు. కాబట్టి ఆ seat కోసం ఊర్లు తిరుగుతూ చాలా బిజీగా ఉన్నాను. నాకు 'గురువుగారు నన్ను శిరిడీ రప్పిస్తారో లేదో' నన్న భయం చాలా పెరిగింది. సరేనని నేను జూలై 8వ తారీఖున శిరిడీకి టిక్కెట్టు బుక్ చేసుకున్నాను. ఈ విషయంపై రోజూ గురువుగారికి నమస్కారం చేసుకునేవాడిని. ఒకరోజు రాత్రి గురువుగారు స్వప్నంలో కనిపించారు. నేను ఆ స్వప్నంలో గురువుగారికి నమస్కరించి నేను ఇంటర్ పాస్ అయ్యానని చెప్పాను. నన్ను వెంటనే గురువుగారు తిట్టనారంభించారు. నాకు భయంవేసింది. కొంతసేపటికి ఆయన శాంతించారు. అప్పుడు నేను, 'స్వామీ! నేను, మా ఫ్రెండ్స్ శిరిడీ రావాలి అక్కడ ఎనిమిది రోజులు గడపాలి' అని అనుకున్నాను. అప్పుడు ఆయన 'సరే రా నాన్న' అని అన్నారు. మళ్ళీ నేను, 'నేను మిమ్మల్ని నమ్మను మీరు నాకు ప్రమాణం చేయాల్సిందే' అని చేయి చూపించాను. వెంటనే ఆయన నా చేయిపై చేయి ఉంచి అభయమిచ్చారు. దీనికి ముందు Engg. సంభాషణ జరిగింది. అంతటితో నాకు మెలుకువ వచ్చింది. అప్పటి నుండి నాకు ఇక శిరిడీ విషయంలో భయం లేదనిపించింది. ఉన్నట్టుండి నన్ను College వాళ్ళు (Engg. Seat ) విషయమై జులై 7వ తారీఖున రమ్మన్నారు. నేను 8వ తేది టిక్కెట్ రిజర్వు చేసుకున్నాను. ఇక నేను శిరిడీ వెళ్ళనేమోనని భయం వేసింది. తెలిసిన వారు కూడా Ticket Cancel చేసుకో, ఇంకోసారి పోవచ్చులే అని అన్నారు. కాని నేను మాత్రం Ticket Cancel చేయలేదు. ఎందుకంటే నేను ఎలాగైనా శిరిడీ వెళ్తానని నాకు నమ్మకం. అక్కడకు వెళితే 2 రోజులు పడుతుంది అని అనుకున్నాను. కానీ అక్కడకు వెళ్ళాక 2 గంటలలో పని అయింది. మరల ఆగష్టు 6న కనిపించమన్నారు. అప్పుడు నా ఆనందానికి అంతులేదు. 'రేపు ప్రొద్దునే శిరిడీ వెళ్ళు' అని మా ఇంట్లో వాళ్ళ అనుమతి కూడా వచ్చింది. ఆ విధంగా నేను అనుకున్న ప్రకారం 8వ తారీఖున మా ఫ్రెండ్స్తో కలిసి శిరిడీ బయలుదేరాను. శిరిడీకి వచ్చి సరిగ్గా 8 రోజులు గడిపాను. నాకు ఇచ్చిన మాట ప్రకారం శిరిడీ రప్పించినందుకు గురువుగారికి కృతజ్ఞతలు తెలుపుకున్నాను. నా శిరిడీ ప్రయాణంలో ఆనందానికి అంతులేదు. గురువుగారిని చూడగానే కళ్ళలో నీరు కారింది. గురువుగారిని Engg. Seat విషయమై కోరుకున్నాను. నేను తిరిగి తిరుపతికి జూలై 17వ తారీఖున వచ్చాను. నేను కోరుకున్న విధంగానే లోకల్ లోనే నాకు సీట్ దొరికింది. అది కావాలనుకున్న ECE లో సీటు. ఈ విధంగా నా జీవితంలో గురువనుగ్రహాన్ని గుర్తించడం జరిగింది. లోకల్ లోనే సీట్ ఇప్పించి ముఖ్యంగా సత్సంగాలకు దూరం కాకుండా అనుగ్రహించారు. 'నా భక్తుడు అడిగినవన్నీ నేను ఇస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలచింది వారు అడిగేంతవరకు, మరియూ నేను ఇచ్చిన మాట నెలబెట్టుకుంటాను' అన్న మాటలు నా ఈ అనుభవంలో అక్షరసత్యమైంది.

గురువుగారికి నమస్కారాలతో

ప్రవీణ్

*గురువు లేక మార్గమెరుకపడదు. (గురువినా కోను బతావ్ వాట్) - కబీరు*

## తోడు నీడా గురువే

నా పేరు అనిల్ కుమార్. నేను హైదరాబాద్‌లో ఉంటాను. మా స్వగ్రామము తెనాలి.(జనవరి) సంక్రాంతి పండుగ వారములో జరిగిన సంఘటన ఇది. నేను హైదరాబాద్ నుండి తెనాలికి Intercity Train లో వచ్చాను. అదే రోజు అదే ట్రైన్‌లో తెనాలి నుండి హైదరాబాద్‌కి (నా చెల్లెలు) సునీత తన ఇద్దరు పిల్లలతో వెళ్ళాల్సి ఉంది. ఇద్దరు పిల్లలతో ఒక్కటే వెళ్ళాలని తను ఆందోళన పడుతుంది. నేను కూడా ఎట్లా అనుకుంటూ ఉన్నాను. చివరికి అనగా గుంటూరు స్టేషన్‌కి 10ని॥ల ముందు మరల ఇదే ట్రైన్‌లో మా చెల్లెలి తో పాటు తిరిగి వెళదాము అనుకున్నాను. మరల వెంటనే అలా నాకు తిరిగి వెళ్ళాలి అనిపించలేదు. అలా మధ్యే మార్గమైన పరిస్థితిలో ఉన్నాను. ఈ లోగా గుంటూరు రానేవచ్చింది.

సరిగ్గా అప్పుడే మనస్సులో 'గురుదేవా' ఎవరైనా 'గురుబంధువు' హైదరాబాద్‌కి వెళ్తూ కనబడితే చాలు, వాళ్ళతో పాటూ సునీతని పంపిద్దాము అనుకున్నాను. ఈ ఆలోచనలతో తెనాలి రానే వచ్చింది. ప్లాట్‌ఫామ్ మీద జనం చాలా మంది ఉన్నారు. ఇసుక వేస్తే రాలదు అన్న సామెత ఆ క్షణంలో గుర్తుకు వచ్చింది. అందులో పండుగ సీజన్ కావడంకూడా కారణం కావచ్చును. ఆ జనములో మా చెల్లెలు ఎక్కడ ఉందో గుర్తించడం కష్టమయ్యింది కూడా. వాళ్ళ కోసము నేను కూర్చొని ఉన్న సీట్ అట్టే పెట్టి గుమ్మము దగ్గర నుంచొని చూస్తున్నాను. వాళ్ళు కనబడలేదు. ఈ లోగా జనం ట్రైన్ లోనికి ఎక్కుతున్నారు. నేను క్రిందకు దిగి వెదికితే కరెక్టుగా నేను ఉన్న ముందు బోగీలోకి వాళ్ళు ఎక్కారు. మా నాన్నగారు వాళ్ళని స్టేషన్‌లో దింపడానికి వచ్చినారు.

వాళ్ళు ఎక్కిన బోగీలోకి ఎక్కి నేను వాళ్ళని చూసి ఎవరు ఉన్నారా అని చూస్తే సునీత ప్రక్కనే మన గురుబంధువు సుబ్బారావుగారు, ఆయన భార్య, ఇద్దరూ వాళ్ళ అబ్బాయి స్టేట్స్ వెడుతున్నాడట, సెండాఫ్ ఇవ్వడానికి వాళ్ళు హైదరాబాద్ వెడుతున్నారట. నిజానికి సునీతకు, సుబ్బారావుగారికి పరిచయం ఉంది. ఆయన కూడా నేను వెళ్ళి చెప్పేదాకా గుర్తుపట్టలేకపోయారు. ఈ విధంగా గురువుగారు నా కోరికను తీర్చినారు.


కె. అనిల్ కుమార్, తెనాలి

*ఎంత చదివినా, ఎంత గ్రహించినా - నిర్మలమైన వర్తనము అలవరచుకొనని యెడల*
*అది అంతయు వ్యసన కారణమే అగును*
*- శ్రీ సాయి అనుసరణము*

## న.. భయం అనుకుంటే
## అభయమే వుందంటే ...

సాయిపథం గురుబంధువులకు నా హృదయ పూర్వకమైన నమస్కారములు. నా పేరు గాయత్రి. మాది విజయవాడ. గురుకృప సంచికకు భక్తులు పంపే వాళ్ళ అనుభవాలు నాకు చాలా నచ్చినవి. నాకు కూడా బాబా, గురువుగార్ల అనుగ్రహంతో చాలా అనుభవాలు ఉన్నాయి. కానీ ఏనాడు రాయని నేను, గురువుగారు 'ఈరోజు నా

చేత వ్రాయిస్తున్నారు'. అది అదృష్టంగా భావిస్తున్నాను. రీసెంట్‌గా జరిగిన ఒక అనుభవం గురించి చెపుతున్నాను. మాది ఒక అందమైన ఉమ్మడి కుటుంబం. మా మరిదికి రీసెంట్‌గా మద్రాసులో ఉద్యోగం వచ్చింది. మద్రాసు షిఫ్ట్ అవ్వాలి. కాని ఉమ్మడి మీద కొన్ని అప్పులు ఉన్నాయి. దానికోసమని బ్యాంక్‌లో లోన్ పెట్టాము. ఆ లోన్ సేంక్షన్ అవ్వటం కోసం ప్రొసెసింగ్ ఫీజ్ కట్టాలి. కాని ఆ ఫీజు కట్టడానికి ఎక్కడ డబ్బులు దొరకలేదు. మాకు ఎన్ని అప్పులు ఉన్నా ఇంత వరకు బంగారం తాకట్టుపెట్టలేదు. నిన్న రాత్రి డబ్బు దొరకపోయేసరికి మా పాపాయికున్న రెండు గొలుసులు తాకట్టు పెట్టి డబ్బు తెస్తాను అన్నారు. నేను వాటిని మా వారికి ఇచ్చినాను. కానీ నా మనస్సులో ఏదో తెలియని బాధ. అయ్యో! ఎప్పుడూ లేదు ఇది ఏమిటి? రేపు మార్నింగ్ 10 గంటలకల్లా డబ్బు కట్టాలి, రాత్రి 7.30కు ఈయన వచ్చారు. అప్పుడు ఎవరు ఇస్తారు. చిన్న ఎమౌంటు 5300/- అయినా, అని నేను ధైర్యం చేసి నగలు ఇచ్చాను. కానీ నాలో దుఃఖం ఆగలేదు. బాబా, గురువుగార్ల ముందు కూర్చుని ఏమిటీ ఈ పరీక్ష అనుకుంటూ నాకు ఏడుపు వచ్చింది. నగలు ఎప్పుడూ తాకట్టు పెట్టలేదు మొదటి సారి నా చేతితో తాకట్టు పెట్టమని ఇచ్చేసరికి ఏమిటో తెలియని బాధ ఏర్పడింది. తరువాత గంటకి మా వారు వచ్చి వారి ఆఫీసులో ఆయన కనిపించి డబ్బులు అప్పుగా ఇచ్చాడు. గొలుసులు తీసుకో అన్నారు. చెప్పలేను మాటల్లో నా ఆనందం. లోన్ రాగానే ఆ బాకీ తీరుద్దాము అని అన్నారు. ఆ క్షణం చాలా ఆనందం వేసింది అంతా గురువుగారి లీలే. కానీ తరువాత మరుక్షణం అనిపించింది -గురువుగారు ఇన్ని లీలలు చేస్తున్నారు కదా! ఏదో ఒకటి చేసి నాలో కోరికలు లేకుండా చేయవచ్చుకదా అని, అందుకనే ఆయనకు రాసే ప్రతి లెటర్‌లోను ఈ విషయం వ్రాస్తుంటాను. ఏదైనా మనం తీసుకునే స్టేటస్ కలిపించి కానీ ఆయన ఇవ్వరు. ఆ స్టేటస్ మనలో రావాలి. అదీ ఆయనే చెయ్యాలి. నాకు నా గొలుసులు వచ్చాయి అన్న ఆనందం కంటే బాబా, గురువుగారు నా మొర ఆలకించి వెంటనే అభయం ఇచ్చినట్టుగా ఆయన చూపే లీలకు చాలా ఆనందం వేసింది. గురువుగారే నాలో ఉన్న రాగద్వేషాలు, కోరికలు, అహంకారం అన్ని పోగొట్టాలి అని ఆశతో ఎదురు చూస్తున్నా




**- గాయత్రి**

## సత్సంగ సుమహారం

శిరిడీ సాయియానలో గురుబంధువు శ్రీ కొండయ్యగారు చేసిన సత్సంగ భావానుసరణం 'సాయిపథం - అంటే శ్రీ సాయిబాబా చూపిన మార్గం, ఆయన నడిచినబాట, సాయి అనే గమ్యానికి రహదారి. ఏ ఒక్క మత సాంప్రదాయానికి చెందక ప్రపంచంలోని మహాత్ములందరూ ఆచరించి బోధించిన విశ్వజనీనమైన ఆధ్యాత్మిక సాంప్రదాయం - సాయిమార్గం. మరో మాటలో సాయిపథం అంటే సద్గురుపథం. - బాబూజీ' సాయిపథం అంటే ఏమిటో, అలాంటి సాయిపథంలో మనందరి చేయిపట్టి నడిపించేందుకు ఈ రోజు గురువుగారు మన ముందు సాక్షాత్కరించారు. ఈ పథానికి పేరు పెట్టటమే కాకుండా, ఆయన ముందు నడుస్తూ మన చేయిపట్టుకొని నడిపిస్తున్నారు. నడకనేర్చుకొనే పిల్లల్లా నడుస్తున్నాం మనం. కాబట్టి ఎప్పుడూ కుడా పెద్ద వాళ్ళం ఏం చేస్తుంటాం, పిల్లలకి మన చేయినందించి వారు నడక చేర్చుకొనేంత వరకు మన సహాయం వారికి అందిస్తాం. ఆ తరువాత వాళ్ళు స్వతంత్రంగా నడవగలుగుతారు. కాబట్టి మొట్టమొదట ఒక ఆదరువు కావాలి.

మనందరికి బాబా గూర్చి, ఒకరకంగా చెప్పాలంటే, ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే కూడా సాయిపథానికి వచ్చిన తరువాతే 'బాబా అంటే ఏమిటో' అర్థమయింది. అంతకుముందు మన దృష్టిలో 'బాబా' అంటే అన్ని దైవాలలానే, బాబాకు ఒక నమస్కారం పెట్టి, ఒక టెంకాయ కొట్టి ఉపవాసం వుంటే - బాబా భక్తుడయినట్లే లెక్క- మరి ఈ రోజు బాబా భక్తి అంటే టెంకాయ కొట్టడం కాదు, ఉపవాసం ఉండటం కాదు (అలా వుంటేనే బాబా భక్తుడు కాదు అన్న విషయం సాయిపథం లోవున్న ప్రతి ఒక్కరికి తెలుసు). భగవంతుని మీద ప్రేమ్ పెట్టి టెంకాయలు కొట్టడం తప్పు అనికాదు, ఆ చేసే ప్రతి పని ఒక అర్థవంతమయిన పనిగా చేయగలగాలి. టెంకాయ దేనికి కొడుతున్నాం? ఎవరి ప్రీతి కోసం కొడుతున్నాం? అలాగే ఉపవాసం దేనికోసం, ఎవరి కోసం వుంటున్నాం? దానివల్ల మనకేమయినా ప్రయోజనం వుంటుందా? శ్రీ ఎం.డబ్ల్యు ప్రధాన్ అనే సాయిభక్తుడు ఒకసారి తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా శిరిడీలో శ్యామా ఇంట్లో ఏర్పాటు చేసిన విందుకు, ఈ రోజు గురువారం కనుకతాను భోజనం చేయననీ, అందువల్ల విందుకు హాజరు కాలేనని ప్రధాన్‌కు క్షమాపణ చెప్పి బాబా వద్దకు వెళ్ళాడు బాలాభాటే. భాటేను చూడగానే శ్రీ సాయి బాబా - 'భావూ (ప్రధాన్) విందుకు వెళ్ళి భోంచేసావా? ' అని అడిగారు.



**భాటే** - 'బాబా ఈ రోజు గురువారం'

**బాబా** - 'ఓహో! అయితే ఏమిటట? '

**భాటే** - 'నేను గురువారాలు భోజనం చేయను అది నా నియమం'

**బాబా** - 'ఎవరి ప్రీతి కోసం ఈ నియమం పెట్టుకున్నావు? '

**భాటే** - 'మీ ప్రీతి కోసమే!'

**బాబా** - 'అయితే నేనే చెబుతున్నాను పో! పోయి భావుతో బాటు భోజనం చేయి!'

అప్పటికే సాయంత్రం నాలుగయింది అయినప్పటికీ భాటే ప్రధాన్‌ను కలుసుకొని, బాబా ఆజ్ఞ గురించి చెప్పి భోజనం చేసాడు. (సాయిభక్తి సాధన రహస్యం)...

ఈ విషయాలను, ఈ రహస్యాలను మనకు విశదపరిచారు గురువుగారు సాయిభక్తి సాధన రహస్యం ద్వారా. గురువుగారు వ్రాసినటువంటి 'సాయిభక్తి సాధన రహస్యం' అర్థం మనం ఒకసారి ఆలోచించామంటే సాయిభక్తిని సాధించడానికి కావలసినటువంటి రహస్యాలేమిటి! అన్న విషయం అవగతమవుతుంది.

భగవంతుడిని చేరుకోవాలనే వారికి మహాత్ములు ఇంతవరకు ఏం చేస్తున్నారు - వాళ్ళ నాశ్రయించిన శిష్యులకు, వారి పరివారానికి ఒక మంత్రాన్ని చెవిలో ఉపదేశిస్తూ, ఆ దైవాన్ని ఎలా కొలవాలో, దైవాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఒక మార్గాన్ని పెట్టి - అలా చేస్తూ వుంటే భగవద్దర్శనమవుతుంది అన్నది మనకు తెలిసిన విషయం. మరి బాబా - దీనికి భిన్నంగా ఓ మాట చెప్పారు - **మా సాంప్రదాయమే వేరు, మంత్రోపదేశాలు లేవు** అని.

మరి ఉపదేశాలు లేకుండా మనం ఎలా తరించాలి? మనం చిన్నప్పటి నుండి విన్నది - గురువు నాశ్రయిస్తే కాని మనం ముందుకు పోలేము అన్నది. దానికి విన్నూత్నంగా గురువుగారు చెప్పిన, చూపిన మార్గం - ఆ భక్తిని


మన మందరం సాధించి బాబాను చేరాలంటే దానికి కొన్ని రహస్యాలున్నాయి. అవి ఇవిగో అని పుస్తకంలో గురువుగారు వివరించినటువంటి ఎన్నో అద్భుతమయిన రహస్యాలను మనం జాగ్రత్తగా చదువుకుంటూ పోతే, మనకు సామాన్యంగా వచ్చే ఎన్నో సందేహాలు నివృత్తి అవుతాయి. అందుకే గురువుగారు దానికి పెట్టిన పేరు సాయిభక్తి సాధన రహస్యం

మరిన్ని విశేషాలు వచ్చే సంచికలో

## స్వర్ణోత్సవ సుమంగా మనం ఏం సమర్పిద్దాం?

## "సమర్పణ చేయు సమయం"

గురుదక్షిణ యను సదాచారం అనాదినుంచి అనుస్యూతంగా సాగుతున్న సత్సంప్రదాయం. గురువుపట్ల శిష్యునికుండే భక్తి భావతీవ్రతకది దర్పణం వంటిది. శిష్య మనోభిష్టానికి, ఆర్తికి, అర్పణకు అంగీకరించే అరుదైన అపురూప సన్నివేశమది. గురుసాంప్రదాయం తెలిసిన శిష్యునికది అపురూపమైన వరం. తేలియాడే ఆనంద రమ్య మహోత్సవం. (ఇది ఆధ్యాత్మిక గురువులకు సంబంధించిన విషయమని మనవి) తన గురువు తనను ఏఏ విషయాల నుంచి ఎలాఎలా ఉద్ధరించారో పునరావృతమైన మరుక్షణం, అర్థమైన ఆ క్షణాన వాస్తవం గ్రహించిన శిష్యుడు ఊరకుండలేడు. తనేదో సమర్పించాలని, సమర్పణ చేయాలని తహతహలాడుతాడు. శిష్యప్రీతికై, శిష్య సంతోషానికై, శిష్య వాత్సల్యానురక్తులైన గురువు అనుగ్రహ రూపంగా అంగీకారముద్ర వేస్తారు. అయితే సాంప్రదాయం, విధాయం తెలిసిన శిష్యుడు ధన, కనక, వస్తు, వాహనాదులు ఎంతమాత్రం ఇవ్వడు. గురుని అనుగ్రహాదులు తెలిసిన వాడు, గురు హృదయమును అర్థము చేసికొనినవాడు తానేమివ్వగలడో, పూర్వులేమి సమర్పించినారో, చరిత్రల పట్ల, వాస్తవాలపట్ల అవగాహన కలిగినవాడై 'యద్య దాచరతి శ్రేష్ఠః' అను రీతిగా తాను తనవంతుగా గురునిపాదాల చెంతకు చేరువౌతాడు.



*'ఇచ్చుకున్నవారు పుచ్చుకొన్నట్టిదియు*
*ఒకటె వస్తువంచు ఉండదయ్య*
*సమత మమత ప్రేమ సద్భక్తి మోదము*
*నడత - సత్యవాక్య నాణ్యతయును ॥భక్తి భరిణె నుండి॥*

ఇద్దరుండరన్న సత్యం తెలియాలంటె అందరికీ సాధ్యపడదు. గురునిది గురునికే సమర్పణ జరుగుతుందనుకుంటారు.

*ఇవ్వవలెనని తపన! ఏమివ్వగలవు నీవు*
*గురునికడ లేనిది! గురునిది కానిది*
*నీకడ ఏమున్నది! నీదైనదేమున్నది*
*అర్పణ చేయుకొలది! అంతయు ఆయనిదే*
*హృదయకవాటముతెరువ!*
*అతడడగవలెనా! యోచింప ॥భక్తి భరిణె॥*

కాబట్టి గురువుకు మనం సమర్పించేదేమిటి? మనమేది చేయడం వల్ల గురువు మనపట్ల ఆనందించుతారో యోచించాలి?

మనలోని చెడ్డగుణాలను గుర్తించుకోగల్గి! ఓ సద్గురురాయా! నేనశక్తుడను, నేను బలహీనుడను, నీ అనుగ్రహ సంపత్తి వల్ల నాలోని లోపాలను గుర్తించాను. వీటి బారినుండి నన్నుద్ధరించగలరని ప్రార్ధించే విధానమొకటయితే.

*'చీకటి తొలగితే - వెలుగేగా ఉండేది*
*కలుపు మొక్క పీకితే! పైరేగా పండేది ॥భక్తి భరిణి॥*

'సద్గురురాయా! నాలో నీకిష్టమైన ధార్మిక గుణాలను అమితంగా పెంచు. అది నావల్లకాదు. నీ దయా విశేషమే నన్ను ఉద్ధరించగలదు. నన్ను నీవాణ్ణిగా తీర్చిదిద్దు - పెంచు - పోషించు - నీ సన్నిధికి అర్హమైన గుణాలను నాలో దండిగాపెంచు - అని ప్రార్ధించే విధానమింకొకటి

*'అనంతమైన వెలుగుల మధ్య*
*ఉండదు చీకటికి తావు*
*మబ్బులెంతగా ఎగకమ్మినను*
*సూర్యకాంతిని నిరోధించలేవు' ॥భక్తి భరిణి॥*



కాబట్టి గురుబంధువులారా! గురుకృపద్వారా మీకు తెలియజేయు విన్నపమిది.

*బాబా కేవలం మన కోరికలు తీర్చటం మాత్రమే కాదు, వాటిని ఒక క్రమంలో, చక్కటి సంఘటనల కూర్పుతో మనకు అందించి, మన అంతరంగం వాటివల్ల స్థిరైన పంథాలో ప్రభావితమయ్యేట్లు కూడా చూస్తారు. ఎవరికి వారు తమ తమ అనుభవాలను జాగ్రత్తగా విశ్లేషించి సమీక్షించుకొంటే, శ్రీసాయి కేవలం 'వరదైవమే' కాదు, 'పర' దైవం కూడా నన్న సత్యం బోధపడగలదు. అంతేకాదు, ఇహపర శ్రేయోదాయకమైన సాయిభక్తి 'యోగం' యొక్క అపూర్వ ప్రాశస్త్యం కుడా అవగతం కాగలదు!*

సాయిభక్తి సాధన రహస్యం